

# పసిడిమనసులు - షర్మిల



## *నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!*

(ప్రారంభం)

# చిన్ని ఆశ

**ఊరంతా మంచు** దుప్పటి కప్పుకున్నట్టుంది. తెల్లారిందనడానికి సూచనగా గూళ్లల్లో నుంచి వదిలిన కోళ్లు సందడిగా అరుస్తున్నాయి. దూరంగా బళ్లకు కట్టిన ఎడ్ల మెడలో కట్టిన గంటలు మోగుతున్నై. తమ్ముడు దోమ తెర వేసిన మంచమ్మీద దుప్పటీ కప్పుకుని పడుకున్నాడు.

నేను తమ్ముడిని తట్టి లేపబోయాను. వాడు బద్దకంగా పక్కకితిరిగి పడుకున్నాడు. వాడి చెవి దగ్గర రహస్యం చెబుతున్నట్టు

" ఒరేయ్ ఈ రోజు శివరాత్రిరా, లే.. తొందరగా" అనగానే వాడు దిగ్గున లేచి కూర్చున్నాడు.

నిజంగా! ఆనందంతో వాడి మొహం విచ్చుకుంది.

"అయితే మనం ఐలూరు తిరణాలకి వెళ్లచ్చా?" అన్నాడు.

" ఏమో మనం ఎప్పుడూ వెళ్లలేదుగా! పోయిన శివరాత్రికి కూడా మనం ఐలూరు తిరణాలకి వెళ్లలేదు"

"వెళ్తే ఎంత బాగుంటుందో కదక్కా! అక్కడ దమడమాల బండి అమ్ముతారు అదంటే నాకెంత ఇష్టమో " అన్నాడు ఆశగా .

"తాతకి అంత ఇష్టం లేదంట. వెళ్దామని అందరూ అన్నా 'అక్కడ జనాలు ఇసకేస్తే రాలనంతమంది వస్తారు. పిల్లల్ని తీసికెళ్తే తప్పిపోతారు' అని వంక పెట్టాడు కానీ నిజం ఏంటంటే అయనకి ఇవన్నీ ఇష్టం వుండదని నానమ్మ అనడం విన్నాను"

నా మాటలు విని, వాడు మొహం ముడుచుకున్నాడు. నాకు జాలేసింది.

" సర్లేరా పద మనం వంతెన దగ్గరకి వెళ్లి ఎన్ని బళ్లు వస్తున్నాయో లెక్కపెడదాం " అనగానే మంచం దిగాడు.

మేం లేవడం చూసిన నాన్నమ్మ "ఇవాళ శివరాత్రి తలారా స్నానాలు చేయాలి" అనడంతో మొహాలు కడిగి తలమీద నుంచి నీళ్లు పోసుకున్నాం. తయారై చిన్న వంతెన దగ్గరకు పరిగెత్తాం.

ఆ మంచును చీల్చుకుంటూ వరసగా ఎడ్ల బళ్లు చీమల బారులా వస్తూనే వున్నాయి. ఆ బళ్లకు పైన వెదురుతో అల్లిన గూళ్లు వున్నై...లోపల కూర్చునేందుకు వీలుగా ఇంతెత్తున గడ్డి వేసి ఆపైన మందపాటి దుప్పటి వేశారు. కొన్నిటికి పరదాలు కట్టి వున్నాయి.

తమ్ముడి ఆనందానికి అంతే లేదు. ఒక్కో బండి వెళ్తుంటే దానికి కట్టిన ఎడ్లు ఏ జాతివో వర్ణిస్తున్నాడు.

"అదిగో బారుగా కొమ్ములు, సన్నగా వుంది వేగంగా పరిగెడుతున్నాయే అవి మైసూరు ఎడ్లు, దిట్టంగా వున్నాయే అవి గిత్తలు..." అని చెప్తూ ఆనందిస్తున్నాడు. నాకు తెలుసు వాడికి మూగజీవాలంటే ఎంతో ఇష్టం, ఎక్కువ సేపు వాటితోనే గడుపుతాడు!

ఇంట్లోంచి వచ్చి చాలాసేపు అయ్యిందని, ఇక నాన్నమ్మ తిడుతుందని వెనక్కి బయలుదేరాం.

"ఎక్కడికి పోయార్రా పాలు తాగకుండా!?" అని కేకలేసింది. పాలు తాగడం పుర్తవుతుండగా పెద్దనాన్న సైకిలు బెల్లు వినిపించింది..

ఆయన హడావిడిగా వచ్చి " అమ్మడూ! బయలుదేరు నిన్ను ఐలూరు తిరణాలకి తీసుకెళ్తా "అన్నాడు.

నేను పెదనాన్నను నాన్న అనే పిలుస్తా... అమ్మా, నాన్న నార్త్ లో వుద్యోగం కావడంతో నాన్నమ్మ మమ్మల్ని పసితనం నుంచి పెంచింది. నేను పసిదానిగా వున్నప్పుడు పెదనాన నన్ను చేరదీసి ముద్దు చేసేవాడంట. మొదట్లో పిల్లలు లేక బాధపడే పెదనాన్నకు నేనంటే ప్రాణం. తరువాత అయనకు కొడుకు పుట్టినా నన్ను గారాబం చేయడం మానలేదు. నన్ను ఎత్తుకుని నాకంటే చిన్నవాళ్లైన తమ్ముళ్లను నడిపించుకుంటూ చాకి రేవు మీదుగా వెళ్తుంటే 'మా చాకళ్లు " బంగారం లాంటి మగబిడ్డలని నడిపిస్తా... ఈవగారిని ఎత్తుకుంటారేంటండే... మీరు మరీను" అనేవారు.

"ఊరుకోండ్రా నా బంగారుతల్లిని నడిపిస్తానా ... అది ఇక నన్ను ఎత్తుకోలేవులే నాన్నా అనే వరకు ఎత్తుకునే తిప్పుతా గానీ నడిపిస్తానా" ...అంటుంటాడు.

మా పెదనాన్న వాళ్ల అమ్మ సుక్కమ్మామ్మ కి మాత్రం, మా పెదనాన్న తన కొడుకుని పట్టించుకోవటల్లేదని బాధ వుండేది. నన్ను "ఏమే నీకు మీ తమ్ము డే ముఖ్యం గానీ , మీ పెదనాన్న కొడుకును పట్టించుకుంటావా ? ఎంతైనా అరువు అరువే... అసలు అసలే " అనేది. నాకు ఏంచేయాలో అర్ధమయ్యేది కాదు. అందుకే అందరూ చూసేటప్పుడు తమ్ముడిని తిడుతూ వాడంటే లెక్కలేనట్టువున్నట్టు వుండడం అలవాటైంది.

నేను ఏదడిగినా పెదనాన్న కాదనడు. ఎప్పుడో ఒకసారి ఐలూరు తిరణాలకి తీసికెళ్లమని అడిగానని ఇప్పుడు తీసుకెళ్లటానికి వచ్చాడు. వెంటనే ఆనందంగా సైకిలెక్కబోయాం.

"ఒరే నువ్వు ఎక్కడికిరా? అక్కని తీసుకెళ్తా ...నువ్వు ఇంటివద్దనే ఉండిపో.." అనగానే వాడు ఏడుపు లంకించుకున్నాడు.

"ఇద్దరిని ఎక్కించుకుని అంత దూరం తొక్కలేను, అయినా ఇంటి దగ్గర కృష్ణ కూడా వెంటపడ్డాడు. వాడిని వదిలేసి నిన్ను తీసికెళ్తే వాడు ఏడుస్తాడు" అని పెదనాన్న అనగానే

"పోనీ వాడిని కూడా తీసుకెళ్దామా!?" అనబోయిన నేను మాట్లాడకుండా వూరుకున్నాను. మా సుక్కమ్మామ్మ "వీడికన్నా నీ తమ్ముడంటేనే ఇష్టం" అనే మాట కూడా గుర్తొచ్చింది. నేను సైకిలు వెనుక క్యారేజీ మీద కూర్చున్నాను

మేం బయలుదేరడమే తరువాయి, తమ్ముడు ఒక్కక్షణం అలాగే వుండిపోయాడు. మేము కాస్త దూరం వెళ్లామో లేదో మావెనకాల పరిగెత్తుకుంటూ వస్తున్నాడు.

" పెదనాన్నా... తమ్ముడు మన వెనకలే పరిగెట్టుకుంటూ వస్తున్నాడు " అన్నాను .

" వస్తే రానీ వెధవని వాడే వెనక్కి పోతాడులే " అంటా స్పీడుగా సైకిలు పోనిచ్చాడు. అయినా తమ్ముడు పరుగు ఆపలేదు.

" ఒరేయ్ ఇంటికి వెళ్లిపోరా నీకు అక్కడి నుంచి దమడమాల బండి తెస్తాను" బతిమాలుతూ చెప్పాను. కానీ వాడు పరుగాపడం లేదు. ఊరి చివరి కి వచ్చేశాం. వాడు పరిగెడుతూనే వున్నాడు . నాకు ఏడుపు వచ్చేసింది ... నాకు తిరణాలకి వెళ్తున్నానన్న ఆనందం బదులు వెళ్లకుండా వుండిపోతే బాగుండుననిపించింది. వాడి చిన్ని చిన్ని ఎర్రటి పాదాలు కందిపోయేలా పరిగెడుతున్నాడు. ఊరి చివరివరకూ పరిగెట్టాక ఇక తనను తీసుకెళ్లరని వాడికి అర్ధమైంది. ఆయాసం కూడా వచ్చిందేమో ఏడుపుతో వెక్కుతూ ఆగిపోయాడు. మేం ముందుకు వెళ్తున్న కొద్దీ తమ్ముడు కనుమరుగవుతున్నాడు, కానీ వాడి చిట్టి పాదాల సవ్వడి నా చెవులకు వినిపిస్తూనే వుంది.

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

**COMMENTS**